ట్యాక్సీ స్టాండ్ స్థలంపై రగడ

- మెట్రో రైల్వే స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు లీజు
- లీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు



వివాదానికి కారణమైన ప్రభుత్వ స్థలం ఇదే..

నాంపల్లి: మెట్రో రైల్వే స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు లీజు పేరిట ధారాదత్తం చేయడం స్థానికంగా వివాదాస్పదమైంది. ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంపై స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. వెంటనే లీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నగరంలో మెట్రో రైలు నిర్మాణ దశలో ఉన్నప్పుడు రైల్వే మార్గానికి అనుసంధానంగా ఉండే ప్రభుత్వ స్థలాలను ఆ సంస్థకు కేటాయించారు. ఇందులో హైదరాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ట్యాక్సీ స్టాండ్ కూడా ఉంది. ఇది ఒకప్పుడు జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉండేది. ఈ 1500 గజాల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉండటంతో ట్యాక్సీ డ్రైవర్లు తమ వాహనాలను పార్కింగ్‌కు వినియోగించేవారు. తద్వారా ఎంతో మంది రైల్వే స్టేషన్‌కు వచ్చే ట్యాక్సీ డ్రైవర్లకు ఉపాధి దొరికేది. తొలుత ఈ స్థలాన్ని మెట్రో రైల్వేస్టేషన్ అవసరాలకు బదలాయించారు. ఫలితంగా అనేక మంది ట్యాక్సీ డ్రైవర్లు ఉపాధిని కోల్పోయారు.

ట్యాక్సీ డ్రైవర్లు, వ్యాపారస్తుల ఆందోళన..

ప్రస్తుతం మెట్రో రైల్వే తన సొంత అవసరాలకు వినియోగించుకోకుండా నాంపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా (బల్దియా సరాయి పక్కన) ఉండే స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చేసింది. లీజుకు తీసుకున్న సదరు ప్రైవేట్ వ్యక్తి ట్యాక్సీ స్టాండ్ స్థలాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. ట్యాక్సీ డ్రైవర్లు, స్థానికులు, ఇతర వ్యాపారస్తులు ఆందోళనకు దిగడంతో ఈ వివాదం మరింత తీవ్ర రూపం దాల్చింది. స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి ట్యాక్సీ స్టాండ్‌తో పాటుగా జీహెచ్ఎంసీ ఫుట్‌పాత్‌లు తొలగించడం, సీఎస్ఐటీఏ చర్చికి చెందిన స్థలాన్ని ఆక్రమించడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన లీజును మెట్రో రైల్వే సంస్థ వెంటనే రద్దు చేసుకోవాలంటూ ఆందోళనకు దిగారు. నాంపల్లి పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని వెంటనే అదుపులోకి తెచ్చారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి



ప్రజల అవసరాలను కాదని ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్నారు. నాంపల్లి మెట్రో రైల్వే స్టేషన్‌కు పక్కన ఉండే ట్యాక్సీ స్టాండ్‌ను ఓ హోటల్ వ్యాపారికి ఇవ్వడమేమిటి. మెట్రో రైల్వే ఎండీ ఈ విషయంలో పునరాలోచించాలి. లీజును రద్దు చేసుకోవాలి. లేదంటే ఆందోళన చేపడుతాం. – రాహుల్‌చంద్ర, బీజేపీ నాంపల్లి ఇన్‌చార్జి

లీజు పేరిట దౌర్జన్యం సరికాదు



మెట్రో రైల్వే దగ్గర స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అలాగే ఫుట్‌పాత్‌లను ధ్వంసం చేయడం, చర్చి స్థలాలను ఆక్రమించడం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను కాజేయడమే కాకుండా స్థానికులపై దాడులకు దిగడం సరికాదు. ఈ విషయంలో మెట్రో ఎండీ వెంటనే స్పందించి లీజును వెనక్కి తీసుకోవాలి. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఎందుకు లీజుకు ఇవ్వాల్సి వచ్చిందో చెప్పాలి. – వై.థామస్, సీఎస్ఐటీఏ చర్చి కేర్ టేకర్

సమాజ సేవకే జీవితం అంకితం



అఫ్జల్‌గంజ్: సమాజ సేవకే జీవితం అంకితమని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. 40 ఏళ్లుగా సమాజ సేవలు చేస్తున్న డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌ను అంతర్జాతీయ యునేస్కోక్లబ్స్ ఇన్‌సౌత్ ఇండియా రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీరామనాథం పరమేశ్వర్‌రావు ఘనంగా సత్కరించారు. అన్ని రంగాల్లో అన్ని వర్గాల ప్రజల కోసం రాజ్‌నారాయణ్ ముదిరాజ్ చేసిన సేవలు అమోఘమని ఆయన కొనియాడారు. అనంతరం రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ..తన జీవితాంతం సమాజ అభ్యున్నతికి, సమాజ సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

సన్మానం



గోల్కొండ: బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్‌ను పలువురు బీజేపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కట్ట నర్సింగ్‌రావు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ శ్యామ్‌సుందర్, వేణుకుమార్ తదితరులున్నారు.

అలరించిన సంగీత కచేరీ



నాంపల్లి: నాదప్రభ సమర్పణలో 'భజన సేయ రాదా' శీర్షికన ప్రదర్శించిన సంగీత కచేరీ అలరింపజేసింది. శనివారం రాత్రి నందమూరి తారక రామారావు కళా మందిరంలో సంగీత కచేరీ కార్యక్రమం జరిగింది. కళాకారులు సత్య శ్రీరామ్–హోకల్, రాఘవ చరణ్, శ్రీకర్–హార్మోనియం, షణ్ముఖ శ్రీవత్స–వయోలిన్, కస్తూరి లలితా కుమార్ భార్గవ్–తబలపై వాయిద్య సహకారం అందించారు. పలు అంశాలకు చక్కటి వారు వాయిద్యాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జె.పద్మజా రాంబాబు సమన్వయం చేశారు. పలువురు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు హాజరై కచేరీని ఆస్వాదించారు.

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మణిలాల్ షా, కుమార్ రావు తదితరులు

అబిడ్స్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా, ఉపాధ్యక్షులు కుమార్ రావు, భాస్కర్‌రావు, వెంకటరామిరెడ్డి, నీరంజన్, యాదగిరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



హరితకు అభినందనలు తెలియజేస్తున్న రహ్మత్ అలీ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వాణిజ్య పన్నుల శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హరిత అన్నారు. శనివారం ఆమెను తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గెజిటెడ్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రహ్మత్ అలీ, అసోసియేట్ అధ్యక్షుడు హరిప్రసాద్, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మధు, శ్రీకాంత్, రవీంద్రనాయక్, నాగు నాయక్, ప్రదీప్ పాల్గొన్నారు.

చికెన్, కోడి గుడ్ల వినియోగంపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: పౌల్ట్రీ బ్రీడర్స్ కో ఆర్డినేషన్ అసోసియేషన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓల్డ్ అల్వాల్, బోయిన్ పల్లి, నాంపల్లి, అత్తాపూర్, సరూర్ నగర్, హయత్‌నగర్, మన్సూరాబాద్, మొయినాబాద్ ప్రాంతాల్లో 'చికెన్–కోడిగుడ్ల మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగిస్తూ చికెన్ వంటకాలు, ఉడికించిన కోడి గుడ్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద బర్డ్ ఫ్లూ వైరస్ చనిపోతుందని వెల్లడించారు. అలాంటిది మన భారతదేశంలో 100 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ వేడిలోనే వండుతారని, దీనివల్ల ఏ ప్రమాదం ఉండదని అవగాహన కల్పించారు.

నాలా అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

యాకుత్‌పురా: గంగానగర్ నాలా, ముర్గీ నాలా అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ రెయిన్‌బజార్, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలందర్ వాలాజాహితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాలాల అభివృద్ధి, విస్తరణ పనుల్లో భాగంగా కొన్ని నెలలుగా కొనసాగుతున్న పనులు నిలిచిపోయాయన్నారు. పనులు ముందుకు సాగక పోవడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వివరించడంతో ఆయన మూడు రోజుల క్రితం పర్యటించి వెంటనే చర్యలు తీసుకొని పనులను తిరిగి ప్రారంభించారని ఆయన తెలిపారు.

అంధ విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

యాకుత్‌పురా: సగౌర చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో దారుషిఫా ప్రభుత్వ ప్రత్యేక అంధుల పాఠశాలలోని 75 మంది విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. పేదరికంతో బాధపడుతున్న విద్యార్థులు, అంధ విద్యార్థులకు తమ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ చేయూతనందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖుద్సీయా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, సద్గుణ, సిబ్బంది పాల్గొన్నారు.



'అక్షరానికి జీవితాన్ని మార్చే శక్తి ఉంటుంది'



మాట్లాడుతున్న మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: అక్షరానికి జీవితాన్ని మార్చే శక్తి ఉంటుందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ రచయిత గంటా రజిని (ఐశ్వర్య) రెడ్డి రచనలపై సాహిత్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అక్షరం క్షరం కానిది, నాశనం లేనిది అన్నారు. ఒక గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ సమాజానికి ఉపయోగపడే రచనలు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఆన్‌లైన్ రచనల ద్వారా సైతం రెండు మిలియన్ల మంది పాఠకులను సంపాదించుకోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం పలువురు సాహిత్యకారులు, రచయితలను సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రచయిత గంట రామిరెడ్డి, సోమనాథ కళాపీఠం అధ్యక్షులు రాప్రోలు సత్యనారాయణ, అంతర్జాతీయ మానవతా న్యాయ నిపుణులు సుధాకరణ శర్మ, కార్మిక సంక్షేమ సేవా నాయకులు బి.గాల్‌రెడ్డి, సాహితీవేత్తలు వేముల సాయిచరణ్, దీపక్, గజావెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఆలయం.. శివరాత్రికి సిద్ధం



కాశీబుగ్గ శివలింగం



ఆలయంపై శైవం, వైష్ణవం శిఖరాలు

జియాగూడ: మూసీ తీరాల్లో వెలిసిన చారిత్రక శివాలయంలో కాశీబుగ్గ ఎంతో ప్రత్యేకతం. 1822 ప్రాంతంలో రాజా రాఘవ్ రాంజీ నిర్మించారు. ఈ ఆలయానికి ఇంకో ప్రత్యేకత ఉంది. అక్రమదారుల నుంచి రక్షించడానికి బయటి నుంచి ఇంటి రూపంలో నిర్మించబడింది. శైవం, వైష్ణవం విరాజిల్లే క్షేత్ర నిర్మాణంలో ఇంజినీరింగ్ చతుర్యాన్ని చాటి చెబుతుంది. ఆలయ శిఖరం పాముల నమూనా నిర్మితమైంది. కాశీ ఉన్నట్లు ఈ కిషన్‌బాగ్ శివలింగం భూగర్భంలో ఉంటుంది. మూసీనది పక్కనే ఉండడం, నిరంతరం గంగనీరు శివలింగానికి అభిషేకం చేస్తూ మూసీనదిలో కలుస్తుంది. ఈ నీరు ఎక్కడి నుంచి వస్తుందో అనేది నేటికీ అంతుపట్టని రహస్యం. ఎన్నో ఔషధ గుణాలు గల ఈ నీటిని సేవిస్తే పలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, ప్రాణాంతక రోగాలు సైతం నయమవుతాయని భక్తుల విశ్వాసం. నిత్యం శివలింగార్చనతో తరించే గంగమ్మ అమ్మవారితోపాటు ఆంజనేయుడు, నారదుడు, దత్తాత్రేయ స్వామికి నిత్య పూజలు ఉంటాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి..



మహా శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. వేలాదిగా ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సేవా సమితి సభ్యులు నాతో పాటు టీఓం సింగ్, ఎ.అనిల్, అర్జున్ ఠాకరే కృషి చేస్తారు. – బాబన్న, కాశీబుగ్గ ఆలయ సేవా సమితి సభ్యులు

నేడు మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఉద్యోగ మేళా

జియాగూడ: ఇమాంపురాలోని నవ భారత సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆదివారం ఉదయం మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారు ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 90321 42714, 63036 04176, 86880 14013, 94932 92534లలో సంప్రదించవచ్చు.

ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ కార్డులు తప్పనిసరి

గోల్కొండ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ కార్డు తప్పనిసరి అని గోల్కొండ మండల డిప్యూటీ ఐవోఎస్ మహ్మద్ బషీరుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ మండలానికి చెందిన పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా అపార్ ఐడీ కార్డు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, అపార్ ఐడీ కార్డులో విద్యార్థి వివరాలన్ని నమోదై ఉంటాయని ఆయన అన్నారు.

విద్యార్థులకు న్యూట్రీషియన్ కిట్లు పంపిణీ



అబిడ్స్: ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బేగంబజార్ పరిధిలోని చుడిబజార్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు న్యూట్రీషియన్ కిట్లు పంపిణీ చేశారు. ఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం పేద విద్యార్థుల కోసం పలు రకాల న్యూట్రీషియన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సైకాలజిస్ట్ కౌన్సిలర్ కలావతి కాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ సభ్యులు ఇందిరా భారతి, వెంకటేశ్వరీ, చంద్రకళ, అశ్విని, దేవమ్మ, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో పేరు నమోదుకు మరో అవకాశం

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన మేధావులు, బీసీ వర్గాల నాయకులతో పాటు పలు వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కులగణనలో పేరు నమోదుకు మరో అవకాశం ఇచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కుల గణనపై అవగాహనకై జాతీయ బీసీదళ్ ఆధ్వర్యంలో రూపొందించిన టీ షర్ట్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు కుల గణనలో పాల్గొనకుండా సమాచారం ఇవ్వని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మూడు పద్ధతుల్లో కుల సర్వేలో సమాచారం ఇవ్వడానికి అవకాశం ఇచ్చామన్నారు.



కుల గణనపై అవగాహన కల్పించేలా రూపొందించిన టీషర్ట్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

శివ మహా జాగరణ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, సదానందంగుప్తా తదితరులు

జియాగూడ: రహీంపురా శంకర్‌జీ హనుమాన్‌జీ కల్యాణ మండపంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని మహా శివరాత్రి జాగరణ భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు మహా శివరాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి పూర్ణచందర్‌రావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిసి మహోత్సవ వాల్‌పోస్టర్‌ను సదానందం గుప్తా ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.రాజన్‌కుమార్, అదనపు కోశాధికారి సచిన్ రాజ్ సింగ్, తోట శ్రవణ్ కుమార్, యాదా శ్రీనివాస్ గుప్తా, గోపాల్ సింగ్, వ్యాఖ్యత వి.మల్లేష్ యాదవ్, జంగం పాండు, చుక్క నవీన్, ఎ.శ్రీనివాస్‌గుప్తా, సందీప్ గుప్తా, రవికుమార్, హరినాథ్, సురేష్ సింగ్ పాల్గొన్నారు.

గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. శనివారం హిందీనగర్‌లో రూ.35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. ముఖ్యంగా జాంబాగ్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సమస్యలు లేకుండా స్థానిక కార్పొరేటర్ల సహకారంతో ఉన్నతాధికారుల చొరవతో పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, రవీందర్ సింగ్, శైలేందర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, కృష్ణ, గణేష్‌యాదవ్, ఆనంద్ జైన్, మయూర్, రాజేష్, రఘు, నందుకుమార్, జగపతి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

జియాగూడ: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం సబ్జిమండిలోని శ్రీసాయి హైస్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శన స్కూల్ కరస్పాండెంట్ ప్రణిత ఆధ్వర్యంలో ఏర్పాటు కాగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎక్స్‌పో ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రదర్శనను తిలకించి మాట్లాడుతూ.. శ్రీసాయి హైస్కూల్ ప్రతి సంవత్సరం విద్యార్థుల సైన్స్ ప్రదర్శన, గేమ్స్ కాంపిటీషన్ తదితరవి నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రణిత, కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు ముత్యాల భాస్కర్, ప్రిన్సిపాల్ ఎల్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్

గోల్కొండ: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు ఉన్నాయని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా ఆసుపత్రి ఔట్ పేషంట్ విభాగాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన ఫార్మసీ విభాగంలో రోగులకు డాక్టర్లు రాసిన మందులు అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో దంత విభాగం, ఈఎన్‌టీ, ఫిజిషియన్, గైనిక్, జనరల్ ఫిజిషియన్‌తో పాటు అన్ని విభాగాల వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెంటెండ్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన ఆసుపత్రి ఆర్ఎంవో, సూపరింటెండ్ తదితరులతో సమావేశమయ్యారు. ఆసుపత్రి నిర్వాహణలు ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని ఆయన అన్నారు.

ఉన్నత విద్యలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ బీఎస్.మూర్తి తదితరులు

గోల్కొండ: ఉన్నత విద్యలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రిసర్చ్ అండ్ ఇన్నోవేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నత విద్య చదివిన విద్యార్థులు ఎంటర్ ప్రీనేటర్లుగా మారడానికి నవ్యత, పరిశోధన ఎంతగానో అవసరం అన్నారు. విద్యార్థుల సమగ్ర ఎదుగుదల, పరిశోధనలో మహిళల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఐబీఎంకు చెందిన శశాంక వాలేటీ, మన్‌కీ సీఈవో త్రిభువన్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, డాక్టర్ రాజ్‌కిరణ్, డాక్టర్ ముత్యాల శరత్, విండ్ స్ట్రీమ్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటకుమార్ తంగిరాళ్ల, డాక్టర్ శాశ్వత్ పాటక్, జీఎన్ఐటీఎస్ ఉపాధ్యక్షురాలు జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



వైభవంగా పల్లకీ సేవ

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి పల్లకీ సేవ ఊరేగింపుతో స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిచింది. బ్యాండ్ మేళాలు, విద్యుద్దీపాల నడుమ పురవీధుల్లో కొనసాగిన ఈ ఊరేగింపులో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్ గౌడ్, కమిటీ సభ్యులు బి.వందన, విజయలక్ష్మి, శ్రీధర్, శైలేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్‌తో పాటు అశోక్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, ప్రమోద్ కార్వకండ్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గుర్మీత్ సింగ్

చాంద్రాయణగుట్ట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడుతాయని సీఆర్‌పీఎఫ్ సిగ్నల్–2 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ గుర్మీత్ సింగ్ అన్నారు. ఫలక్‌నుమాలోని నారాయణ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లు అందరిని ఆలోజింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విజ్ఞాన ప్రదర్శనలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి మెరుగుపడుతుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫాతీమా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, అకాడమిక్ ఆర్ఎన్‌డీ సునిత, కో ఆర్డినేటర్స్ జ్యోతి రావు, స్వప్న, వందన తదితరులు పాల్గొన్నారు.